

కలిదిండి హైస్కూల్లో డివైఇఒ విచారణ

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న పోతే రత్నదాస్‌పై వచ్చిన ఆరోపణలపై డివైఇఒ ఎన్.రవీంద్రభారతి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రవీంద్ర భారతి మాట్లాడుతూ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, పాఠశాల సిబ్బందిపై దురుసుగా వ్యవహరించడం వంటి ఆరోపణలపై విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని విచారించామన్నారు. దీనిపై పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తానని తెలిపారు. తదుపరి సమాచారం ఇచ్చే వరకూ విధులకు హాజరు కారాదని రత్నదాస్‌కు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 రవి ప్రకాష్, ఎంఇఒ-2 శ్రీనివాసరావు, హెచ్ఎం బి.స్వర్ణకుమారి, ఐసిడిఎస్ సిడిపిఒ దీప్తి, సూపర్‌వైజర్ కరుణ, అంగన్వాడీ కార్యకర్త ఎస్‌కె అబీదాబేగం, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్వరం .. జరభద్రం..!

వాతావరణ మార్పులతో జ్వరాలు జనాలను వెంటాడుతున్నాయి. ఇప్పటికే ఏజెన్సీలో మలేరియా కేసులు పెరగ్గా, జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న పరిస్థితి ఉంది. వైద్యఆరోగ్యశాఖ జ్వరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. మొన్నటి వరకూ తీవ్రమైన ఎండలు, గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు వెంటాడుతుండటంతో జలుబు, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు జనాలను చుట్టుముడుతున్నాయి.



- వాతావరణ మార్పులతో వైరల్, మలేరియా జ్వరాలు
- ఏజెన్సీని వెంటాడుతున్న మలేరియా
- జనవరి నుంచి ఇప్పటి వరకూ 434 మలేరియా కేసులు నమోదు
- జూన్, జులైలో ఏలూరు జిల్లాలో ఐదు వేల మందికిపైగా వైరల్ జ్వరాలు
- డెంగీపై జనంలో లోలోన ఆందోళన
- ముందస్తు చర్యలు చేపడితేనే ప్రజలకు రక్ష

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏజెన్సీలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మలేరియా కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. జనవరి నుంచి ఇప్పటి వరకూ మొత్తం 434 మలేరియా కేసులు నమోదయ్యాయి. అత్యధిక కేసులు వర్షాకాలం ప్రారంభమైన తర్వాతే నమోదయ్యాయి. మైదాన ప్రాంతంలో ఐదు కేసులు నమోదవ్వగా, ఏజెన్సీలో 429 మలేరియా కేసులు నమోదయ్యాయి. గిరిజనులు మలేరియా జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలేరియా జ్వరాలను అరికట్టేందుకు ఇప్పటి వరకూ రెండుసార్లు స్ప్రేయింగ్, ఫ్రైడే డ్రైడే వంటి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు సర్వేలైన్స్ సెంటర్లను పటిష్టం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో మలేరియా జ్వరాలు మరింత విజృంభించే పరిస్థితి కనిపిస్తోంది. ఏజెన్సీలో వైద్య శిబిరాలు నిర్వహించడం, మలేరియా పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడం, సంబంధిత మందులు అందుబాటులోకి తీసుకురావడం చేయాల్సి ఉంది. లేకపోతే ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. గడిచిన నాలుగు నెలల్లో డెంగీ కేసులు నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. తాజాగా ఒక కేసు నమోదైనట్లు తెలుస్తున్నా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. గత అనుభవాలు పరిశీలిస్తే ఏలూరు నగరంలో డెంగీ కేసులు పెద్దసంఖ్యలో నమోదైన పరిస్థితి ఉంది. దీంతో ఏలూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డెంగీ జ్వరాల పేరుతో ప్రయివేటు ఆసుపత్రులు రోగుల నుంచి భారీగా దోపిడీ చేసిన పరిస్థితి ఉంది. డెంగీ పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తారు, డెంగీ జ్వరాలపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ముఖ్యంగా ఏలూరు నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. లేక గతంలో మాదిరిగానే డెంగీ జ్వరాలు పెద్దఎత్తున ప్రబలే పరిస్థితి ఉంది.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు..

వర్షాలు కురుస్తుండటంతో జలుబు, వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయి. గడిచిన జూన్‌లో వైరల్ జ్వరాలు 2,600 వరకూ నమోదవ్వగా, జులైలోనూ అదేస్థాయిలో వైరల్ జ్వరాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గడిచిన రెండు నెలల్లో ఏలూరు జిల్లావ్యాప్తంగా ఐదువేలకుపైగా వైరల్ జ్వర కేసులు నమోదైనట్లు లెక్కలు చెబుతున్నాయి. వైరల్ జ్వరాలు వస్తే రోగులు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి, తాగునీరు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. వైరల్ జ్వరాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో వైద్యఆరోగ్య శాఖ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. అదే క్రమంలో ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీని అడ్డుకోవాల్సి ఉంది.

హామీల అమలుకు ప్రభుత్వం కృషి

చింతలపూడిలో హోం శాఖా మంత్రి అనిత

పోలవరంలో పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభం



చింతలపూడి: సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి అనిత, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, ప్రముఖులు



పోలవరం: పోలీసు స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె బుధవారం చింతలపూడి వచ్చారు. ఆమెకు ఫాతిమాపురం అడ్డరోడ్డు సెంటర్‌లో కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆంథోనీ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ గత ప్రభుత్వానికి రూ.మూడు వేలు పెన్షన్ ఇచ్చేందుకు ఐదేళ్లు పట్టిందని, కూటమి అధికారంలోకి రాగానే రూ.4 వేలకు పెంచిందని గుర్తు చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే తాము వచ్చామని, ఈ సందర్భంగా మీకు ఇంకా ఏం కావాలో తెలియజేయాలని కోరారు. తల్లికి వందనం 90 శాతం మందికి అందిందని, మిగిలిన పది శాతానికి సంబంధించిన సమస్యను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో చింతలపూడి నియోజకవర్గానికి రూ.కోటిన్నర నిధులిస్తే కూటమి అధికారంలోకొచ్చిన ఒక సంవత్సరంలోనే రూ.185 కోట్లు నిధులు ఇచ్చిందని వివరించారు. రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు వచ్చాయని, త్వరలోనే రోడ్లు వేస్తారని తెలిపారు. గత ప్రభుత్వ తీరు వల్లే రోడ్లకు ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసినా జగన్ పట్టించుకోలేదన్నారు. చింతలపూడి నియోజకవర్గానికి ఏం అవసరమొచ్చినా తాను చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఇక్కడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ చాలా తెలివైనవారని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతారని చెప్పారు. నాయకులంతా ఐక్యంగా ఎంఎల్ఎకు అండగా నిలిస్తే మంచి ఫలితాలు వస్తాయని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం మరో రెండు దశాబ్దాలపాటు అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశలో ముందుకెళ్తోందన్నారు. గ్రామాల్లో పర్యటిస్తుంటే ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పెన్షన్ సొమ్ముతోపాటు పెన్షన్లు పెరిగాయన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు తాటి అప్పారావు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళి, మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, శేషు, సునీత, లీలా ప్రశాంతి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం: పోలవరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం పోలవరంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. భవన ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి ఐజి అశోక్‌కుమార్, ఎస్‌పి ప్రశాంత్ శివకిషోర్, ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నూతన పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీలో పోలీస్ స్టేషన్ల అభివృద్ధికి ఐజి తీసుకున్న చర్యలను అభినందించారు. పోలీస్ స్టేషన్లకు డ్రోన్లు, సీసీ కెమెరాల సౌకర్యాల కల్పనకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరాన్ని, అమరావతిని రెండు కళ్లుగా భావిస్తున్నారన్నారు. పోలవరం నిర్మించడమే గాక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కేబినెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించారన్నారు. గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐజి, ఎస్‌పి, ఎపి ట్రైకార్ ఛైర్మన్, పోలవరం ఎంఎల్ఎ హోం మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. మంత్రి పోలీస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించారు. అనంతరం మంత్రి ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు నివాసం వద్ద స్థానిక టిడిపి నేతలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ పవన్‌కుమార్, తహశీల్దారు సాయిరాజు, ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాసబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పి-4 గ్రామసభలు అర్థవంతంగా నిర్వహించాలి

సభల వివరాలు వెంటనే అప్‌లోడ్ చేయాలి

బంగారు కుటుంబాల అవసరాల సర్వే పకడ్బందీగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం



ప్రజాశక్తి - ఏలూరు

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమం గ్రామసభలు అర్థవంతంగా నిర్వహించి, నిర్వహించిన గ్రామసభల వివరాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. పి-4 కార్యక్రమం గ్రామసభల నిర్వహణ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక తదితర అంశాలపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఆమె బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రంలో సున్నా పేదరికమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో బుధవారం నిర్వహించిన గ్రామసభల వివరాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని, మిగిలిన గ్రామసభలను రేపటికల్లా పూర్తిచేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని ఆమె స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలను గుర్తించడంలో భాగంగా కొత్తగా గుర్తించిన వారిని, అనర్హుల జాబితాలను గ్రామసభలో వివరించాలన్నారు. బంగారు కుటుంబాల జాబితాను మరోమారు పరిశీలించి అవసరమైన వివరాలను పొందుపరచాలన్నారు. అనంతరం ఆయా కుటుంబాల అవసరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా మార్గదర్శకులను ఎంపిక చేసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారిని దత్తత తీసుకునేందుకు ఆయా గ్రామ, మండల పరిధిలో పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, దాతలు తదితరులతో సమావేశం నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేవారి జాబితాలను వెంటనే సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, ఎంపిడిఒలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరిచేలు

లబోదిబోమంటున్న రైతులు



నీట మునిగిన పొలాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వరి పైరు నీట మునిగింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే నీరు పంట పొలాలను ముంచెత్తిందని రైతులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో వరినాట్లు వేసిన కొద్ది రోజులకే పొలాలు నీటి మునిగిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నాట్లను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పంట కాలవల్లో, డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు పెరిగి నీటిపారుదలకు ఆటంకంగా మారాయి. దీంతో దిగువకు నీటి పారుదల లేకపోవడంతో డ్రెయిన్లు ఎదురుతన్నడంతో పొలాల్లో ముంపు నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. నాలుగు రోజుల క్రితం వరకూ వర్షాలు లేక నీటి కోసం ఇబ్బంది పడ్డ రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చేలు ముంపు బారినపడి పంట నష్టపోతామేమోననే ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పంట కాలువల్లో, డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

మట్టి దందా, గ్రావెల్ తరలింపుపై చర్యలు చేపట్టాలి

సహజవనరులను పరిరక్షించాలి

జడ్‌పిటిసి పిన్నిబోయిన వీరబాబు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులు, రెవెన్యూ కొండగట్టు భూములను కొల్లగొడుతూ గత పది రోజులుగా జరుగుతున్న కొన్ని వేల ట్రిప్పుల అక్రమ మట్టి దందా, గ్రావెల్ తరలింపుపై సంబంధిత అధికారులు స్పందించి సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టి సహజవనరులను పరిరక్షించాలని మండల జడ్‌పిటిసి పిన్నిబోయిన వీరబాబు డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి ఆధ్వర్యాన మండలంలోని నూగొండపల్లి, పెద్దప్ప చెరువు, కొత్త ఈదర, గొల్లవాని వాగు, ఈదులగూడెం, పెద్ద చెరువు, తాడేపల్లి రెవెన్యూలోని నెల్లిగట్టు, రాజవరం నుగట్టు, బ్రహ్మయలింగ చెరువు సమీపంలో వున్న గట్టులకు సంబంధించి అక్రమ క్వారీలు నిర్వహించటం, గ్రావెల్ తరలించటం, వేల ట్రక్కుల మట్టిని, ఇటుక బట్టీలకు అమ్ముకోవడానికి నిల్వ చేయటంపై సదరు వ్యక్తుపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈమేరకు వారు జిల్లా అధికారులకు, డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.హరిబాబు, నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షులు ఇవి.సుబ్బయ్య, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి.పావన సుజనా కుమారి, ఆగిరిపల్లి టౌన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కె.విక్రమ్, డి.రామారావు, కె.ప్రదీప్, ఎం.వెంకటేశ్వరావు, ఎన్.సాంబశివరావు పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న జెడ్‌పిటిసి, నేతలు



అంగన్వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న పర్యవేక్షణ టీం

స్వచ్ఛ సర్వేక్షణ టీం పర్యవేక్షణ

కుక్కునూరు : మండలంలోని కుక్కునూరు గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపిడిఒ నరసింహారావు ఆధ్వర్యాన స్వచ్ఛ సర్వేక్షణ టీం హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మరుగుదొడ్లను డోర్ టు-డోర్ పరిశీలించింది. ఈ సందర్భంగా టీం అధికారి సునీల్ మాట్లాడుతూ పంచాయతీలో చెత్త నుంచి సంపద కేంద్రం అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి, తడి పొడి చెత్త సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ శుభ్రతా ప్రమాణాలు ఉన్నతంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ టీం సభ్యురాలు మధుప్రియ, సర్పంచి రావు మీనా, పంచాయతీ కార్యదర్శులు ధర్మ, గోవిందు, గణేష్, అజయ్ కుమార్, ఎఇ వీరస్వామి పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక సేవలు అభినందనీయం

ఎంఎల్ఎ బడేటి చంటిచే విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్ఫూర్తిదాయకమైన సేవలే సమ సమాజ నిర్మాణానికి సూచికలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఏలూరు ఆర్ఆర్ పేటలోని శ్రీశర్వాణి స్కూల్‌లో నందమూరి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సమకూర్చిన పుస్తకాలు, పెన్నులను బుధవారం ఎంఎల్ఎ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వ పాలనలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యాశాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. ఆ పథకాలన్నింటినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, విద్యలో ఉత్తమంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు బిబిజి.తిలక్, కర్ణ శ్రీనివాస్, శ్రీ శర్వాణి పాఠశాల డైరెక్టర్ కె.మదన్ మోహన్‌రాజు, ప్రిన్సిపల్ సత్యశారద, చల్ల సత్యనారాయణ(పెదబాబు), సంకబాతుల నాగరాజు, 40వ డివిజన్ ఇన్‌ఛార్జి బోర ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్వానంగా మూలలంక-పెదలంక రోడ్డు

ప్రమాదాలబారిన వాహనదారులు



ప్రమాదకర గుంటలో దిగబడిన ఆటో

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మూలలంక-పెదలంక అర్ అండ్ బి రహదారి అధ్వానంగా మారి గుంతలమయంగా మారింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని లంక గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలో చేపల చెరువులు అధికంగా ఉండటంతో లోడు లారీల ద్వారా ఎగుమతులు, దిగుమతులు నిరంతరాయంగా జరుగుతుంటాయి. చెరువుల సాగువల్ల రాష్ట్రానికి ఆదాయం అధికంగానే సమకూరుతుంది. అయినా రోడ్ల మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల చిన్న చూపు చూస్తోందని ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు. గోతుల్లో దిగబడిపోవడంతో పాటు లారీలు, వ్యాన్లు తిరగబడిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వాహనాల్లో ప్రయాణించే వాహనదారులకు, విద్యార్థులకు రోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రాణసంకటంగా మారాయన్నారు. చిన తాడినాడ నుంచి కలిదిండిలోని ఇందిరా కాలనీ వరకు ఇదే పరిస్థితి నెలకొందన్నారు. రోడ్లు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చి చిత్తశుద్ధి చాటుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.మహంకాళిరావు అన్నారు. కూటమి ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే తప్ప గుంతల రోడ్లు పూడ్చిన పరిస్థితి లేదన్నారు. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారన్నారు. గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి, గుంతలు పూడ్చి మరమత్తులు చేపట్టాలని తెలియజేశారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టలేక..

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

రెండు రోజులుగా గాలింపు

ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - ముసునూరు

వసతి గృహంలో ఉండి చదువుకోవటం ఇష్టం లేక ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసుకున్న సంఘటన మండలంలోని లోపూడి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం లోపూడి గ్రామానికి చెందిన బిలుగుది చందు(17) ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేటలో ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసి ప్రథమ సంవత్సరం చదువుతూ అక్కడ హాస్టల్లో ఉంటున్నాడు. ఈ ఏడాది పదవ తరగతి పూర్తిచేశాడు. ఇంట్లో వుండి చదువుకునేందుకు ఇష్టపడిన తమ కుమారుడును తొలుత వారి తల్లిదండ్రులు ఏలూరులోని ఓ ప్రయివేటు కళాశాలలో చేర్పించారు. అక్కడ వసతిగృహంలో ఉండి చదువుకోవటం ఇష్టం లేకపోవటం వల్ల తల్లిదండ్రులు దగ్గర్లో ఉంటాడని విసన్నపేటలోని ఓ ప్రయివేటు కళాశాలలో చేర్పించారు. అక్కడ కూడా ఇష్టం లేక కళాశాల నుంచి గత నాలుగు రోజులు క్రితం ఇంటికి బయలుదేరి, ఇంటికి వెళ్లలేదు. చందు గ్రామానికి వచ్చిన రాకను గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు తెలియపరిచార. వారు ఆ చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఈనెల 21వ తేదీన తమ కుమారుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు ముసునూరు పోలీస్ స్టేషన్‌లో తెలియపరిచారు. శనివారం అదే గ్రామంలో వారి ఇంటి సమీపంలో చర్చి మరుగుదొడ్లు దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి చూడగా చందు ఉరేసుకుని శవమై కనిపించాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



గుంతలు పూడ్చిస్తున్న మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద రోడ్డుపై గుంతలు పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ ఛైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆదేశాల మేరకు వెట్ మిక్స్ గ్రావెల్‌తో బుధవారం గుంతలు పూడ్చారు. మున్సిపల్ కమిషనర్, ఆరవ వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్, సిపిఎం పట్టణ అధ్యక్షులు సూర్యారావు పాల్గొని ప్రజలు ఇబ్బంది పడకుండా గుంతలు సరిచేయించారు.

స్మార్ట్ మీటర్ల ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - కుక్కునూరు

కూటమి ప్రభుత్వం పనిచేస్తున్న డిజిటల్ మీటర్లను తొలగించి, ప్రజల అనుమతి లేకుండా అదానీ స్మార్ట్ మీటర్లను మోసపూరితంగా ఏర్పాటు చేస్తోందని సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్ ఆరోపించారు. కుక్కునూరు పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా నాయకుడు బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సిపిఐ(ఎంఎల్) ప్రజా పంథా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీకి 10 సంవత్సరాల పాటు డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డిబిఎఫ్‌ఒటి) పద్ధతిలో 40 లక్షల మీటర్ల బిగింపు కాంట్రాక్ట్ కట్టబెట్టారని, ఇది విద్యుత్ రంగ ప్రయివేటీకరణకు తొలి అడుగని ఆయన తెలిపారు. సెల్‌ఫోన్ తరహాలో ముందస్తు చెల్లింపుతో రీఛార్జ్ చేయాల్సిన ఈ మీటర్లు, చెల్లింపు లేనిచో విద్యుత్ నిలిచిపోతుందని, గతంలోని 15 రోజులు లేదా నెలవారీ బిల్లింగ్ విధానాన్ని రద్దు చేస్తున్నారని ఆయన విమర్శించారు. స్మార్ట్ మీటర్ల రద్దుకై ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కట్టం వీరాస్వామి, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మున్ని, డివిజన్ నాయకులు పెంకె వీరబాబు, సరియం లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పోలవరం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలకు 10 వారాలకు పైగా బకాయి వద్ద వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చెల్లించాలని, వెంకటరెడ్డి గూడెం గ్రామానికి శ్మశాన వాటిక నిర్మించాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం డిమాండ్ చేశారు. బుధవారం రైతుకూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పోలవరంలోని ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీల జీవితాలతో ఆడుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఉపాధి చట్టంలో 10 వారాలకుపైగా పనిచేసిన వేతన కూలీలకు వేతనాలను చెల్లించకపోవడం పేద ప్రజల పట్ల ప్రభుత్వాలకున్న నిర్లక్ష్య ధోరణిని స్పష్టం చేస్తుందన్నారు. మే నెల నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉపాధి కూలీలు డబ్బులు రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కూలీల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ రూ.600 పెంచాలన్నారు. అనంతరం వెంకటరెడ్డి గూడెం గ్రామానికి శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వెంకటరెడ్డిగూడెం గ్రామ ఆదివాసులు పెద్ద ఎత్తున మండల తహశీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సాయి రాజు, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబులకు అందించారు. వెంకట్ రెడ్డి గూడెం గ్రామ పెద్దలు చెదల నాగేశ్వరరావు, వలస బుచ్చిరాజు, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు మడి వెంకటగిరి, మడకం పోశమ్మ, పదం సరోజిని పాల్గొన్నారు.

నాపై నిందలు తగవు

ముక్కొల్లుపాడు గ్రామ ఉపసర్పంచి కలగర శివ సాయి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తనపై అనేక దుర్భాషలు ఆడుతూ.. లేనిపోని నిందలు మోపిన పెద్దాయన ఎపి ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఎబి.వెంకటేశ్వరరావు విజ్ఞతకు వదిలేస్తున్నట్లు మండలంలోని ముక్కొల్లుపాడు గ్రామ ఉపసర్పంచి కలగర శివ సాయి అన్నారు. నూజివీడులో ఆయన స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ, పరుష పదజాలంతో తనను దూషించటం పెద్దాయనకు సరి కాదన్నారు. గ్రామంలో ఉన్న పరిస్థితులు, ఎవరు ఎలాంటి వారో ఆ పెద్దాయనకు పూర్తిగా తెలియనట్లున్నారు. వారి ఆరోపణల మేరకు బహిరంగ విచారణకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామన్నారు. వైసిపి నుంచి వచ్చినట్లు తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

నేరాలు – ఘోరాలు

భర్త అత్యాశ.. భార్య బలి

33 సెంట్ల కోసం హతమార్చాడు

కేసు ఛేదించిన కైకలూరు పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భర్త అత్యాశ అతన్ని హంతకుడిగా మార్చింది. నాతిచరామి అని పదాలు పలికిన అతనే ఆమెను 33 సెంట్ల ఆస్తికోసం అంతమొందించాడు. మొదట భార్య మరణం అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన పోలీసులు తదుపరి తాను ఆత్మహత్యకు ప్రయత్నించాడని గుర్తించి హంతకుడైన భర్తను బుధవారం రాత్రి అరెస్టు చేసి కైకలూరు పోలీసులు కటకటాల పాలు చేశారు. ఏలూరు నగరంలోని ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ పాల్గొని తెలిపిన వివరాల ప్రకారం కలిదిండి మండలం కట్నంపాలెం ఎస్‌ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన కొల్లు పెద్దిరాజు, కర్రి జయలక్ష్మి(33) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం కలరు. పెద్దిరాజు కూలీ పనులు చేస్తూ భార్యా పిల్లలతో కలిసి జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత కొద్దికాలం క్రితం పెద్దిరాజు అనారోగ్య పాలయ్యాడు. అప్పటినుండి ఏ పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య గత కొద్దిరోజులుగా విభేదాలు తలెత్తాయి. అయితే తాతల నుంచి సంక్రమించిన 33 సెంట్ల పొలం వారికి కలదు. చెరువును అమ్మి సొమ్ము చేసుకుందాం అని భర్త అంటే అమ్మ వద్దని భార్య అంటూ ఉండేది. ఇదే నేపథ్యంలో వీరిద్దరి మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయి. భర్తలో క్రూరత్వం మొదలై ఈనెలలో ఎలాగైనా భార్యను కడతేర్చాలని అతను నిర్ణయించుకున్నాడు. అస్వస్థతకు వైద్య పరీక్షల నిమిత్తం భీమవరం వెళ్లి వస్తానని చెప్పి ఒక కత్తిని కొనుగోలు చేసుకుని ఇంటికి వచ్చాడు. ఈనెల 9వ తేదీన భార్యాభర్తల మధ్య పెద్ద ఎత్తున గొడవ జరిగింది. అనంతరం భార్య నిద్రకు ఉపక్రమించింది. అదే తరువాత పదో తేదీ తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్యను విచక్షణారహితంగా కత్తితో దాడిచేసి అంతటితో ఆగకుండా కత్తితో తన చేతిని కోసుకున్నాడు. అనంతరం పురుగుల మందు తాగాడు. అక్కడికి ఆగకుండా ఉరివేసుకుని ఇలా మూడు రకాలుగా ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కాని అతను చనిపోలేదు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం అతను కోలుకున్నాడు. ఈ ఘటనపై ఈనెల 10వ తేదీన కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా భర్త భార్యను కడతేర్చి ఆపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. బుధవారం రాత్రి అతన్ని కైకలూరు రూరల్ సిఐ వి రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య చెలరేగిన వివాదం కారణంగా పెద్దిరాజు ఎలాగైనా భార్యను హత్య చేసి 33 సెంట్ల స్థలాన్ని అమ్ముకోవాలని నిర్ణయించుకున్నాడని తెలిపారు. కేసును ఛేదించిన కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పితో పాటు సిఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. మార్జిన్ మరిచారు..

రూ.1.20 కోట్లతో నిర్మించిన ఇరుకు రోడ్డు..

రాకపోకలకు ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి నుంచి బొమ్మిడి 1700 మీటర్ల పొడవైన సిమెంటు రోడ్డును గత ఏప్రిల్‌లో ఎంఎన్‌ఆర్‌ఇజిఎస్ గ్రాంటు రూ.1.20 కోట్లతో స్థానిక కూటమి నాయకులు పనులు చేపట్టి నిర్మించారు. నిర్మాణ పనులు బాగానే ఉన్నా ఇరు పక్కల మార్జిన్ వేయకపోవడం పెద్ద సమస్యగా మారింది. 3.75 మీటర్లు వెడల్పు ఉన్న దీనిపై ఒక వాహనం వెళ్తే రెండో వాహనం ఎక్కడానికి ముందున్న వాహనం తప్పుకుని దారిస్తేనే రెండో వాహనం ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కళాశాలల బస్సులు ఎదురెదురుగా వెళ్లేటప్పుడు తప్పుకునేందుకు మార్జిన్ లేకపోవడం పెద్ద తలనొప్పిగా మారింది. రోడ్డుకిరుపక్కలా మార్జిన్(షోల్డర్స్) 1.25 మీటర్ల వెడల్పుతో వేస్తామని పిఆర్ ఎఇ కృష్ణమోహన్ ప్రజాశక్తికి వివరించారు.



బొమ్మిడి - బాదంపూడిలో మార్జిన్ లేని సిమెంటు రోడ్డు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ సుబ్బారావు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగబాబు ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న బియ్యంతో కూడిన అన్నం ఇరవిరలాడుతూ ముద్దగా లేకుండా మంచిగా వడ్డించాలన్నారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎపిఎం రాజశ్రీ

ప్రజాశక్తి - మండవల్లి

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం సహాయక సంఘాలు ఎంతగానో దోహదపడతాయని వెలుగు ఎపిఎం రాజశ్రీ స్పష్టం చేశారు. స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో వెలుగు మిత్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె బుధవారం మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. స్వయం సహాయక సంఘాల సంవత్సర ఆదాయం, ప్లాన్ రికార్డ్స్, సంఘాల మార్చినాటికి ముగింపు లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన రుణాలు మంజూరు లక్షాలను నిర్ధేశించారు. అనంతరం సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజీ పొదుపు ఖాతాల నుంచి రుణాలు తదితర లక్ష్యాల గురించి పూర్తిస్థాయిలో వివరించారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మస్తఫా ఆలీ కైకరం హైస్కూల్‌లో ప్రారంభించారు. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, వునువుల రాంబాబు, డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో నారాయణపురం, ఉంగుటూరు, బాదంపూడి, చిన్నవెల్లమిల్లి, గొల్లగూడెం, చేబ్రోలు గరల్స్ హైస్కూల్‌లో సభ్యత్వ నమోదు జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సిహెచ్.శ్రీధర్, కూనా కమల్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల నరసింహారావు, సీనియర్ నాయకులు అల్లుశ్రీను, పిరిడి ప్రసాద్, పోతురాజు, శింగవరపు శ్రీను, హరికృష్ణ, ప్రేమ్ కుమార్, లక్ష్మీ నారాయణ, కొప్పుల శ్రీను, పైలా ఏడుకొండలు పాల్గొన్నారు. మండలంలో యుటిఎఫ్‌పై నమ్మకంతో పెద్ద ఎత్తున సభ్యులుగా జాయిన్ అయ్యారు.

ముసునూరు : ఉపాధ్యాయులు యూనియన్ సభ్యత్వంలో ఉన్నప్పుడే సమానత్వంతో అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చునని యుటిఎఫ్ మండల నాయకులు జి.పద్మ కిషోర్, గుడిమెళ్ల రాంబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లి తదితర గ్రామాల్లో యుటిఎఫ్ శాఖ కార్యదర్శి బత్తుల అనురాధ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతి పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారుగా 200 మంది ఉపాధ్యాయులు యుటిఎఫ్ సభ్యత్వం తీసుకున్నట్లు జిల్లా కౌన్సిలర్ పద్మలత తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణరావు, సహాధ్యక్షులు పుల్లయ్య, సత్యప్రియ, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

గూండా గిరి సహించేది లేదు

ఇంటిలిజెన్స్ మాజీ చీఫ్ ఎబి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని ముకొల్లుపాడు గ్రామంలో డ్వాక్రా మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించి, దాడి చేసి గుండా గిరికి పాల్పడితే సహించేది లేదని రాష్ట్ర ఇంటిలిజెన్స్ మాజీ చీఫ్ ఎబి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. నూజివీడు పట్టణంలోని వెలుగు కార్యాలయానికి బుధవారం ఆయన చేరుకున్నారు. బుక్ కీపర్లను ఏ నిబంధన మేరకు తొలగిస్తారని ప్రశ్నించారు. సభ్యుల మద్దతు ఉంటే బుక్ కీపర్లను కొనసాగించాలని, కాకుంటే తొలగించే ప్రయత్నం చేయవచ్చు అని సూచించారు. ఎవరి ఒత్తిడి మేరకు ఇలాంటి ప్రయత్నాలు చేసినా చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ వైసిపి నుండి వచ్చి పార్టీ మారినంత మాత్రాన పూర్వపు పద్ధతిలో గుండా గిరి, రౌడీయిజం చేస్తే సహించేది లేదన్నారు. ఈ మేరకు నూజివీడు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలకు సంఘటన వివరించారు. వాస్తవాలు విచారించి, దోషులను శిక్షించాలని సూచించారు.


ఆశీల వసూళ్లలో దందా!

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫిర్యాదులు మాయం : డివైఎఫ్ఐ

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పరిధిలోని మున్సిపల్ ఆశీపన్ను అక్రమ దందా నడుస్తుందని గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చేసిన ఫిర్యాదు ఎంక్వయిరీ చేయకపోగా ఫిర్యాదులు మాయంచేయడం దురదృష్టకరమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. పట్టణం పరిధిలో రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు, చేపలు, మొక్కజొన్న పొత్తులు, స్టిక్కర్లు, టిఫిన్ తదితర చిల్లర వ్యాపారం చేసుకుంటూ పొట్టకూటి కోసం బతుకుతున్న వారిపై చట్ట విరుద్ధంగా రసీదులు ఇవ్వకుండా రూ.100పైబడి ఆశీపన్ను అక్రమ దందా చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిద్రపోతున్న అధికారులు మేల్కొని పట్టణంలో అక్రమ ఆశీపన్ను వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రసీదు ఇవ్వకుండా పన్ను వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, దానికి ప్రభుత్వాధికారులు స్పందించే విధంగా కాన్వాసింగ్ జరపాలని కోరారు. అలాగే గత ఫిర్యాదులను ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బాధితులను ఐక్యం చేసి డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

విద్యార్థులు భవిష్యత్‌పై దృష్టి సారించాలి

ఎస్ఐ కె.శుభశేఖర్



మాట్లాడుతున్న ఎస్ఐ శుభశేఖర్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా వుంటూ తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా చదువుపై దృష్టి పెట్టి తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ అన్నారు. బుధవారం నాడు ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, శక్తి యాప్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ఫేక్ జాబ్ ఆఫర్లు, లోన్ యాప్‌లు, పేస్‌బుక్ వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నానో యూరియా, డిఎపి ఎరువులను వాడాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని ఎంఎం పాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్ భాష పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు యూరియా, డిఎపిలకు బదులుగా నానో యూరియా, నానో డిఎపి ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని, వారికి ఎకరాకు 840 ప్రీమియం చెల్లిస్తే 42 వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. అలాగే మినుము పంటకు ఎకరాకు రూ.300 చెల్లిస్తే రూ.20 వేల బీమా లభిస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఇంకా ఎవరైనా రైతులు అర్హులుగా ఉండి వారి పేర్లు అర్హుల జాబితాలో లేనట్లయితే ఆర్ఎస్‌కె సిబ్బందిని సంప్రదించి గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారి విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి వి.చెన్నారావు, గ్రామ సర్పంచి మాధవి, పిటిసి లక్ష్మీప్రసన్న, గ్రామ నాయకులు వై.సత్యనారాయణ, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి హబీబ్ భాష

మొక్కలు నాటండి.. దేశాన్ని కాపాడండి

ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి రఫీక్



మొక్కలు నాటించే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండి రఫీక్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

'మట్టిలో చేతులు-హృదయంలో దేశం' నినాదంతో జమాతే ఇస్లామీ హింద్ దేశవ్యాప్తంగా జూన్ 25 నుంచి జులై 25 వరకు ముస్లిం బాల బాలికలచే పది లక్షల మొక్కలు నాటించే ఉద్యమాన్ని చేపట్టిందని, మొక్కలు నాటి దేశాన్ని కాపాడాలని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి రఫీక్ తెలియజేశారు. రాష్ట్రంలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ద్వారా సుమారు లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా చేసుకున్నట్లు ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని అసదుల్లా జమా మసీద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇస్లాం ధర్మంలో పర్యావరణ పరిరక్షణకు ఎంతో ప్రాముఖ్యత కలదని, ప్రళయం ముంచుకొస్తున్న మీ చేతిలో మొక్క ఉంటే దానిని నాటమని, మొక్కలను నరకవద్దని, నీటి వనరులను మురికి చేయవద్దని, వృధా చేసే ప్రతి నీటి బొట్టుకి ప్రళయ దినాన లెక్క చెప్పవలసి ఉంటుందని ప్రవక్త ముహమ్మద్ వారు బోధించారని చెప్పారు. చిన్నపిల్లలలో దేశంపట్ల, మొక్కల పట్ల ప్రేమను పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని దీనికి దేశవ్యాప్తంగా మంచి స్పందన వచ్చిందన్నారు. జంగారెడ్డిగూడెం ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జి హమీద జమ మాట్లాడుతూ పిల్లలు మొక్కలు నాటడంలో ఎంతో ఆసక్తి చూపించారని, మొక్కలు నాటి పెంచడం వల్ల వారిలో సున్నితత్వం పెరుగుతుందని, క్రమశిక్షణ ఏర్పడుతుందని, ప్రకృతిని ప్రేమించటం నేర్చుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనాబా టిక్ టాక్ బాజీ షేక్ ముస్తఫా యాఖుబ్, ముస్తాక్, రషీద్, ఆదిల్, ఉస్మాన్, నల్లజర్ల షరీఫ్ షేక్ సుభాని, నబి మాస్టర్ గౌస్, షబ్బీర్, మహిళా అధ్యక్షులు అయేషా పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గం

వైసిపి మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు ముమ్మాటికి అక్రమమేనని మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. నూజివీడులోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఐఎఎస్‌లను, ఐపిఎస్‌లను, వైసిపి నాయకులను, ప్రజాప్రతినిధులను దారుణంగా రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎపిలోని కూటమి ప్రభుత్వంలా వ్యవహరించడంలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయలేకే కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులను అరెస్టు చేస్తూ ప్రజల దృష్టిని మార్చాలని చూస్తోందన్నారు. చంద్రబాబు పాలన తీరును ప్రజలు గమనిస్తున్నారని, వాళ్ళ తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం షాపులను నడిపి వచ్చిన డబ్బులన్నింటినీ రాష్ట్ర ఖజానాకు జమ చేస్తే ఇంకా అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో విక్రయించిన బ్రాండ్లన్నీ చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు అనుమతులు ఇచ్చినవేనన్నారు. కూటమి పాలనలో కక్ష సాధింపులు తారాస్థాయికి చేరాయన్నారు. ప్రస్తుత మద్యం పాలసీలోనే అవినీతి పెద్ద ఎత్తున జరుగుతోందని, ప్రతి మద్యం సీసాపై ఎంఆర్‌పి కంటే రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా అమ్ముతున్నారని, ఈ డబ్బంతా ఎవరిజేబులోకి వెళ్తుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎంఆర్‌పికే మద్యంను విక్రయించే వారని, మద్యం దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధిని సైతం కల్పించిందన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా చివరకు న్యాయమే గెలుస్తుందన్న విషయాన్ని చంద్రబాబు గుర్తెరగాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ గ్రామంలో చూసినా వీధికి రెండు, మూడు మద్యం బెల్టుషాపులు కనిపిస్తున్నాయన్నారు. అరాచకాలు జరుగుతుంటే గతంలో బీహార్‌ను పోల్చేవారని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌తో పోల్చే పరిస్థితులు దాపురించాయన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిందేమన్నా ఉందంటే రూ.1.70 లక్షల కోట్లు అప్పులు చేసి అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దిందన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు మీర్ అంజాద్ ఆలీ, నవుడు నాగమల్లేశ్వరరావు, నాయకులు మలిశెట్టి బాబీ, గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, షేక్ యూనస్‌పాషా, పిళ్లా చరణ్ పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు భోజనం అందజేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం పంచాయతీ వార్డు సభ్యుడు నేకూరి ఆశీర్వాదం మనవడు హర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధ కళాకారిణి రాధా రాణి, కాలరాయి ఉమామహేశ్వరి, యానాద కుటుంబాలకు భోజనాలతో పాటు ఔషధాల కోసం ఆర్థిక సాయం అందించారు. అనంతరం చేబ్రోలు కార్మెల్ స్కూల్‌లో చాక్లెట్స్ పంపిణీ చేశారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం 18వ రోజు సోమవారం స్థానిక తొమ్మిదో డివిజన్ తూర్పు వీధిలోని గౌరీ దేవి గుడి వద్ద డివిజన్ ఇన్‌ఛార్జి పొలమరశెట్టి గోపాలకృష్ణ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ హాజరయ్యారు. డివిజన్ నాయకులు ప్రజలు పూలమాలలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తొమ్మిదవ డివిజన్లో టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, నగర టౌన్ ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అనే ఉద్దేశ్యంతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో టిడిపి నాయకులు గరికి ముక్కు నాని ఆధ్వర్యాన ఆ గ్రామంలో రఘు బాబు పర్యటించి నేరుగా ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మానం రాంబాబు, నాయకులు మానం వంశీ, అబ్బినేని రాంబాబు పాల్గొన్నారు.

హోం మంత్రికి వినతి : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి, లింగపాలెం మండలాలను ఏలూరు రెవెన్యూ డివిజన్లో కలపాలని సిపిఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హోం మంత్రి అనితకి ఆంతోనీ నగర్ వద్ద కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల, మండలాల పునర్విభజనకి రాష్ట్ర ప్రభుత్వం ఉప సంఘం ఏర్పాటు చేసిందని దానిలో హోం మంత్రి కూడా ఒక కమిటీ మెంబర్ అన్నారు. ఆమెని కలిసి చింతలపూడి, లింగపాలెం మండలాలు నూజివీడు డివిజన్లో కలవడం వల్ల నూజివీడు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సౌకర్యం కోసం ఈ రెండు మండలాలు ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ఆమెకు వివరించినట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కంచర్ల గురవయ్య, తొర్లపాటి రాజు, దంతా కృష్ణ, ముళ్ల గిరి అలెగ్జాండర్, టి.మాణిక్యాలరావు ఉన్నారు.

CHANGE OF NAME

I,**KADALI USHA SRI** D/o. Kadali Satyanarayana, D.No.8-8-67/1, Near China Sivalayam, Saradha Theatre Street, Narasapuram-534275, W.G.Dt. I have changed my name from **USHA WILLAM** (Old name) to **KADALI USHA SRI** (New name) hence forth I am being called **KADALI USHA SRI** D/o. Kadali Satyanarayana for all purposes.

పాస్‌పోర్టు పోయినది

మల్లుల మానస, భర్త, వీరాంజనేయ, డోర్ నెంబర్ 3-159, శెట్టి బలిజ వీధి, పంచాయతీ ఆఫీస్ వద్ద, చించినాడ, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి V2591779 నెంబర్, పాస్ పోర్ట్ ది 28-9-2021న తీసుకున్నాను. గత నెలలో నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తీసికొని మా ఇంటి నుంచి పాలకొల్లుకు మోటార్ సైకిల్ పై పాస్ పోర్ట్ జెరాక్స్ కాపీలు తీయడం కోసం రాగా దారిలో నాఒరిజనల్ పాస్ పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెదికినా దొరకలేదు. కాబట్టి నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన నా పై అడ్రస్ కు అందజేయగలరు.

సెల్ : 9502726939

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి,
ప.గో.జిల్లా, ఏలూరు
ఎ.యస్.నెం.14/2025

బిట్వీన్ :
మెట్టపల్లి సాంబమూర్తి ...అప్పిలెంటు
మరియు
1.కంతా రామారావు మరియు ఇతరులు
...రెస్పాండెంట్సు

అప్పిలెంటు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల అప్పీలులో 10వ రెస్పాండెంటు అయిన తాళ్ళూరి చంద్రశేఖర్‌రెడ్డి, S/o. చిన శీతారామిరెడ్డి, రత్న ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్సు, 2వ ఫ్లోర్, మారుతీ నగర్, చింతలపూడి, ఏలూరు జిల్లా మరియు 13వ రెస్పాండెంటు అయిన బవిరిశెట్టి రవికుమార్, S/o.నాగేశ్వరరావు, డోర్‌నెం.9-328, సాయిబాబ గుడి దగ్గర, చింతలపూడి, ఏలూరు జిల్లా అనువారలకు హైకోర్టులో ది.**1-8-2025** తేదీన ఉ॥10.30 ని॥లకు స్వయంగా కాని లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరరు అప్పీలు తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

అవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ, అడ్వకేట్సు,
శ్రీరామనివాస్, అశోక్‌నగర్,
ఏలూరు, ఏలూరు జిల్లా.

ఏలూరు
తేది.23-7-2025